

# దారి తప్పిన పాంథుడు

_మొరవపల్లి రెడ్డి

**నల్లటి** తారు రోడ్డు మీద సర్రున దూసుకు పోతూంది స్టాండర్డు కారు.

స్టీరింగ్ వీల్ దగ్గిర డాక్టర్ శ్రీ వాత్సవ్ కూర్చుని ఉన్నాడు. పాసెంజరు సీటులో నేను కూర్చున్నాను.

ఆకాశం క్రమేపీ జేగురు రంగులోకి మారుతూంది.

సాయంత్రం టీ తీసుకుని, హిస్సార్ అగ్రికల్చరల్ యూనివర్శిటీ నుండిబయలుదేరిన మాకు ప్రయాణం హాయిగానూ, ఆహ్లాదంగానూ సాగుతూంది.

"డాక్టర్ శ్రీ వాత్సవ్! మనం ఢిల్లీ చేరేసరికి మిడ్‌నైట్ అవుతుందంటారా?" అడిగాను.

"లేదు, డాక్టర్! రేపు ఉదయం ఎనిమిది పది గంటల మధ్య! అయినా ఎందుకంత ఆత్రత?" అతడి నవ్వు రేర్ వ్యూ మిర్రర్‌లో ప్రతిబింబించింది.

"అహ! ఏం లేదు! ఎర్లీ మార్నింగ్ ఫ్లైట్ ఉంది కలకత్తా వెళ్ళడానికి. ఆ ఫ్లైట్ కాచ్ చేస్తే ఐ విల్ బి ఇన్ ది హౌస్ బిఫోర్ టెన్!" వెనక్కు తప్పుకుంటున్న చెట్లు, పుట్టల వంక చూస్తూ అన్నాను.

అదోలా గమ్మత్తుగా నవ్వి, "ఏం! ఇంట్లో శ్రీమతీ జీ ఎదురు చూస్తూంటుందా?" అన్నారు శ్రీ వాత్సవ్.

"అబ్బే! అహ! కాదండీ!" ముఖమాట పడ్డాను నేను.

"డాక్టర్ షార్మాజీ! ఐ కెన్ అండర్‌స్టాండ్ దట్! మీ వయసులో ఉన్నప్పుడు నేను మా ఆవిడ కొంగు వదిలి ఒక క్షణమైనా ఉండేవాడిని కాదు! టూర్ ఉంటే సాధ్యమైనంత త్వరగా ఆమె సాన్నిధ్యంలో వాలిపోయే వాడిని! అదే ఆడవాళ్ళ లోని గొప్పతన మనుకుంటాను! అదే వైవాహిక జీవితంలో గల మహాత్మ్యం. లా లైవ్!"

"ఆడవాళ్ళ గొప్పతనమే అని ఎందుకనుకోవాలి? మగవాడి బలహీనత కావచ్చు కదా?" అని పెదవుల దాకా వచ్చింది. కానీ, సభ్యత అడ్డ పడింది. ఓరగా శ్రీ వాత్సవ్ వైపు చూచాను. తెల్లటి దేహచ్ఛాయ, చక్కగా పండిపోయిన ఉంగరాల జుట్టు, దిగజారిన బుగ్గలు, ఫ్రెంచ్ కట్ మీసాలు! యాభయ్యవ పడిలో కూడా ఎమిటి వారిని ఆకర్షించే అందమాయునది!


గత కాలపు వైవాహిక జీవిత వైభవాన్ని నెమరు వేసుకుంటున్నారు కాబోలు! ఆయన పెదవులపై విరిసిన చిరునవ్వు చెరిగి పోలేదు. చూపులు ముందు నిలిపి కారు స్టడీగా పరుగెట్టిస్తున్నారు.

డాక్టర్ శ్రీ వాత్సవ్ అన్నట్టు శ్రీమతీజీ ఇంట్లో ఎదురు చూస్తే? ఆ తలపే హాయనిపించింది. అంతలోనే విరక్తితో కూడిన చిరునవ్వు విరిసింది. బ్రహ్మచారి కోసం ఎవరు ఎదురు చూస్తారు. గుమ్మానికి వేళ్ళాడే తాళం కప్ప, దుమ్ము ధూళి మినహాయించి? అంతలోనే తార గుర్తు వచ్చింది. అన్నీ సవ్యంగా జరిగి ఉంటే తార నా కోసం నిజంగానే ఎదురు చూచేది! కానీ, మనిషి అనుకున్నట్టు ఎప్పుడూ వ్యవహారాలు జరగవు! తార ఇప్పుడు ఎక్కడ ఉందో?

"డాక్టర్ షర్మా! నీ ఫామిలీని కలుసుకోవాలని ఎంత ఆత్రత పడ్డా ఈ రాత్రికి ఢిల్లీ చేరుకుందుకు మాత్రం వీలు పడదు.

ఈ రాత్రికి మనం ఒక వండర్‌ఫుల్ కపుల్ ఇంటికి వెళుతున్నాము."

శ్రీ వాత్సవ్ మాటలు నా ఆలోచనల కంతరాయం కలిగించాయి.



"ఎవరండీ వారు?" అప్రయత్నంగానే అడిగాను.

"నీవే చూద్దూవు గానీ, చెప్పడ మెందుకు? వాళ్ళను చూశాక నీ వూ ఒప్పుకుంటావు వండర్‌ఫుల్ అని!

"అతను నాకు మంచి స్నేహితుడు. గోర్‌గావ్‌న్‌లో స్వంత ఇల్లూ, ఏభై ఎకరాల అగ్రికల్చర్ ఫారమ్స్ ఉన్నాయి. స్వంత వ్యవసాయం. చాలా రోజులైంది. చూసి! ఈ రాత్రికి అతిధ్యం స్వీకరించి అతని ఇల్లు మన పాద ధూళిచే పావనం చేసే వెళదాం! సరేనంటారా?"

ఆయన అంత నిర్ణయం చేశాక కాదనలేక పోయాను. "ఏజ్ యు ప్లీజ్!" అంటూ తల ఆటించాను నేను.

మార్గాయాసం తెలియకుండా కబుర్లు చెబుతున్నాడు డాక్టర్ శ్రీ వాత్సవ్.

మనసు గతంలో సతమత మవుతున్నా, కారు మరి కొన్ని మైళ్ళు పరుగెట్టేసరికి అంత గొప్పగా చెప్పుకునే ఆ ఫ్రెండ్‌ను చూడాలని కుతూహలం కలిగింది. అందులోనూ హరియాణా ప్రాంతంలో వ్యవసాయ దారుని ఇల్లు స్వయంగా చూడ్డానికి అవకాశం కల్పిస్తున్న డాక్టర్ శ్రీ వాత్సవ్‌కు మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాను.

దారి పక్కను ఒక గాస్ స్టేషనులో కారు ఆపి పెట్రోలు నింపుకొని, పక్కనే కాంటీనులో కాస్త దాణా పడేసుకొని, గరమ్ గరమ్ మసాలాచాయ్ తాగేసరికి ప్రాణం కాస్త సర్దుకుంది.

ఈసారి డ్రైవింగ్ సీట్లో నేను సర్దుకున్నాను. చీకట్లిప్పుడ్ ఆవరించాయి.

కృష్ణపక్షపు విదియచంద్రుడు మేఘాలచాటు నుండి చాలా ఆలస్యంగా పంకరించాడు.

ఈసారి మా సంభాషణ మా ఉద్యోగానికే సంబంధించీ, రిసెర్చిలో సాధక బాధకాల గురించీ సాగింది. ఆయనా, నేనూ వ్యవసాయశాఖలో ప్లాంట్ బ్రీడర్స్! నా హెడ్ క్వార్టర్స్ కలకత్తా అయితే, ఆయనది పంత్‌నగర్.

మస్టర్డ్ రేప్‌సీడ్ మీద జరిగిన సెమినారు అటెండ్ కావడానికి హరియాణాలోని హిస్సార్‌కు నాలుగు రోజుల క్రితం వచ్చాము. తిరుగు ప్రయాణం కావడంతో ఆయన ఢిల్లీ దాకా రైడ్ ఆఫర్ చేస్తే కాదనలేకపోయాను.

దాదాపు పదకొండు గంటల రాత్రి అయింది. ఊరంతా నిద్రపోతూంది. డాక్టర్ శ్రీ వాత్సవ్ డైరక్షన్స్ మేరకు కారు గోరగావ్‌నే నుండి మరో రూరల్ రూట్ తీసుకుని పదిహేను ఇరవై మైళ్ళు పోనిచ్చాను.

తిరిగి డ్రైవరు సీటులోకి మారాడు శ్రీవాత్సవ్. మరో అరమైలు ప్రయాణం చేశాక ఒక నిర్జన ప్రదేశంలోని ఒక ఇంటి ముందు కారాపాడు.

శ్రీవాత్సవ్ వాలకం చూస్తుంటే స్నేహితుడు స్నేహితుడు అని ఉబలాటపడ్డమే కానీ, ముందుగా ఆ స్నేహితుడికి ఈ మహాశయుడు తెలిపినట్టే లేదు. ఎంత స్నేహితుడైనా, అర్ధరాత్రి వెళ్ళి తలుపు తట్టడం సభ్యతగా తోచలేదు నాకు. నావరకూ విడిచి పెట్టితే హాయిగా తెల్లవారే వరకూ ఏ అద్దె బసలోనో

గడిపి, ఉదయాన్నే వెళ్ళి "హాయ్!" అంటూ పలుకరించే వాడిని! కానీ, నా చేతుల్లో లేనిపని. అందుకే మూసిన తలుపుల వంకా, కిటికీల వంకా గడ్డప్పగించి చూస్తూ కూర్చున్నాను.

ఇంజన్ ఆఫ్ చేసి, పెన్ టార్చి సాయంతో తలుపు మీద దన్ దన్ మని బాది—"అరె భాయీ! . . . భాయీసాబ్! . . . దోస్త్! . . . నవరంగ్ భాయీ! . . ." అంటూ పదిహేను సార్లి కేకలు వేసిన మీదట ఇంట్లో ఎక్కడో లైటు వెలిగిన ఆనవాలు, తలుపు పక్కనే చిన్న రెక్క తెరిచి "అరెయో! కౌనూ?" అంటున్న బొంగురు గొంతుక వినబడింది.

"అరె దోస్త్! మై హూ! శ్రీవాత్సవ్! భాయీ! దర్వాజా ఖోలో! హమే అందర్ ఆనేదో!!!" అన్నాడు శ్రీవాత్సవ్.

దర్వాజా బార్లా తెరచి— "అరె! మేరేయార్! ఆవ్?" అంటూ అమాంతం వచ్చి శ్రీ వాత్సవను చేతులతో చుట్టేశాడు ఆ అపురూపమైన ఫ్రెండ్.

వెలుతురు గుమ్మంనుండి బయటికి పరుచుకుంది.

"ఇతినీ రాత్ మే కహాసే ఆ రహెహై? ఆవ్! . . ఆవ్! . . . అందర్ ఆవ్!" అంటూ అమాంతం లోనికి లాక్కువెళ్ళాడు.

"వెయిట్ ఎ మినిట్! . . . ఐ . . . హావ్ . . . ఎ ఫ్రెండ్ సిట్టింగ్ ఇన్ ది కార్!" అంటూ నా దగ్గరకు వచ్చి కార్‌డోర్ తెరుస్తూ,

"రండి, డాక్టర్! లెట ఈట్ సమ్‌థింగ్ అండ్ రిలాక్స్ టిల్ మార్నింగ్!" అన్నాడు శ్రీవాత్సవ.

ఈటింగ్ మాట దేవుడెరుగు! ఇంటివారి కమ్మటి నిద్రపాడుచేసి, పిలువని పేరంటాని కన్నట్టు లోనికి వెళ్ళాలంటే చచ్చే మొహమాటంగా ఉంది నాకు.

"మీట్ మై ఫ్రెండ్ నవరంగ్! ఇతను కృషి పండిట్ బిరుదు వచ్చేదాకా విడువనని పట్టుపట్టాడు, డాక్టర్ షర్మాజీ!"

"హి ఈజ్ డాక్టర్ షర్మా!" అంటూ పరస్పరం పరిచయం గావించాడు శ్రీవాత్సవ్.

కరచాలనాలయ్యాయి. లోపలికి వెళ్ళాము.

పంజాబు, హరియాణా ప్రాంతాల్లో ప్రతి ఇల్లూ—సామాన్యుల నుండి ధనికుల దాకా—కార్పెట్లు ఫ్రిజ, సోఫాసెట్లు, టి.వి. వీలుంటే కారు—ఈలా విదేశీయులకు ఏ మాత్రం తీసిపోకుండా అత్యాధునికంగా జీవిస్తారక్కడి వాళ్ళు అని వినడమే కానీ, ఎప్పుడూ చూడలేదు! కలకత్తాలో లక్షలాది పేవ్‌మెంట్లమీద జీవిస్తారు. అక్కడే సుఖాలననుభవిస్తారు. మరి కొన్ని ప్రాణులను ఈ లోకంలోకి తీసుకువస్తారు. దుర్గంధాన్ని పీలుస్తూ బజార్లవెంట నడుస్తుంటె మునిసిపాలిటీ చెత్తకుండీల వెంట వెళ్లినట్లే ఉంటుంది కానీ ఇటువంటి అనుభూతి కలుగదు!

ఖరీదయిన సోఫాసెట్టు మీద ఆసీనులమయ్యాము.

వెలుతురులో నవరంగ్ వాలకం చూస్తుంటే, రాత్రి బాగా పోడాలు కలవని పెగ్గులు లాగించి పడుకున్నట్టుంది! కళ్ళు చింతనిప్పుల్లా మెరుస్తున్నాయి. నడుముకు ఒక లుంగీ చుట్టుకున్నాడు. ఆపైన ఏ ఆచ్ఛాదనా లేదు! ఎదురు రొమ్ము మీద, వీపు మీద కంబళిలా నల్లటి వెంట్రుకలు.

మాట వరసకు నాలుగు మాటలు మాట్లాడి, 'అరె భాయీ! కడుపులో ఎలుకలు కాదు కదా—కారు దున్నపోతులు గెంతులేస్తున్నాయి! చలో! రసోయిమే ఘుసో!" అంటూ లేవదీశాడు శ్రీ వాత్సవ ఏమాత్రం మొహమాటం లేకుండా!

పకపకా నవ్వుతూ—"నాకు తెలుసులే! ఆకలికి ఆగలేవు! . . . . రేష్మను లేపుతాను ఉండు!" చీన్నాడు నవరంగ్.

"నో! నో, నో! . . . . ప్లీజ డూ నాట్ డిస్టర్బ్ హర్! లెట్ హెర్ టెక్ రెస్ట్! అన్నట్టు బాత్‌రూమ్ ఎక్కడుందో చూపెట్టు. షర్మాజీవాష్ చేసుకుంటారు" అన్నాడు శ్రీవాత్సవ్.

నాకు బాత్‌రూమ్ చూపెట్టి, వాళ్ళిద్దరూ రసోయీ లోకి జొరబడ్డారు.

గేజర్ ఆన్ లో ఉంది. వేడినీళ్ళ షవర్ తీసుకునే సరికి ప్రాణం రిఫ్రెష్ అయింది. లాల్చీ, పైజామా ధరించి హాల్లోకి వచ్చాను. కిచెన్‌లో నుండీ గట్టిగా నవ్వులూ, చలోక్తులూ వినవస్తున్నాయి.



MCA-PDP-62-Tel-R

సగం వంటిల్లు హాల్లోకి కనిపిస్తూంది.

నలభీమ సోదరులిద్దరూ రొట్టెలు చేతులతోటే ఎత్తి పెనం మీద కాలుస్తున్నారు.

పదిహేను నిమిషాల అనంతరం బల్లమీద ఆలూ పరాఠా, బట్టర్, రైతా పచ్చి కేరట్, ఆనియన్ టమేటో, పచ్చిమిర్చి ముక్కలు చోటు చేసుకున్నాయి.

అర్ధరాత్రి. అనుకోని అతిథుళ్ళు వస్తే భార్యకు ఇసుమంతైనా శ్రమ ఇవ్వకుండా అన్నీ అమర్చిన అతడి ఓపికను చూస్తే, అతడి శ్రీమతి ఎంతో అదృష్టవంతురా అనిపించింది.

మిత్రు లిద్దరూ నాకు ఎదురుగా కూర్చున్నారు. కిచెన్‌కు ఎదురుగా నేను.

వేడి వేడి పరోఠా తుంపి నోటిలో ఉంచుకోగానే వెన్నలా కరిగి పోతూంది.

వాళ్ళిద్దరూ ఎప్పటెప్పటి విషయాలో గుర్తు తెచ్చుకుంటూ, తెగ నవ్వుకుంటూ, మధ్య మధ్య పచ్చిమిర్చీ, సాలడ్, రైతా నంజుకుంటూ తినడంలో నిమగ్నులయ్యారు.

తల వంచుకు తింటున్న నేను కిచెన్‌లో నేత్ర ద్వయాన్ని చూచి తల ఎత్తాను. ఎవరో స్త్రీ మూర్తి నా వైపే గుచ్చి గుచ్చి చూస్తూంది.

మిసెస్ నవ్‌రంగ్ కాబోలు లెమ్మని తల వాల్చేసు కున్నాను. అయినా, అయస్కాంతలా లాగుతున్నా యా చూపులు!

అటు నీళ్ళు తాగుతూనో, తింటూనో చూడక తప్పడం లేదు.

ఆ కళ్ళు! ఆ మూర్తి! ఎవరో కాదు! తార! ఒకప్పటి నా ప్రియమైన తార! పొసట్లో సింధూరం పాన్ సేవించిన అధరాలు! నిద్ర బరువుతో ఎరు పెక్కిన కళ్ళు! తార ఇక్కడికి ఎలా వచ్చింది? అన్న సందేహంతో ఈ సారి నిశితంగా నవ్‌రంగ్ వైపు చూశాను.

బట్టతల, ఉబ్బిన ముఖం! కెంపుల్లాంటి కళ్ళు, తెల్లటి శరీరచ్ఛాయ! స్థూలకాయం. ప్రొఫెసర్ రంగప్రసాద్ శిష్యుడు రాథోడ్! ఎంత మారి పోయాడు రాథోడ్!

రాథోడ్ సతిగా తార స్వర్గ సుఖాలు అనుభవి స్తూంది. అదృష్టవంతురాలు! లేకపోతే ఏమి ఉండేది?

నా బోటి బడుద్దాయిని పెళ్ళి చేసుకొని ఉంటే చాలీ చాలని కలకత్తా ఫ్లాట్‌లో, మసి బారిన గదిలో ఇరుకు మనస్తత్వాలతో ఆలోచించకుండానికే ఎదురు తిరిగింది మనసు.

గరమ్ చాయ్. రెండు కప్పులు తాగాను. వాళ్ళిద్దరూ విస్కీ మీద కలబడ్డారు.

ఎక్స్‌క్యూజెస్ చెప్పుకుని, నాకు కేటాయించ బడ్డ గదిలోకి పడుకుందుకు వెళ్ళాను. నిజాని కది సమ్మర్‌లో ఉపయోగించే గ్రిల్ వేసిన వరండా. పక్క మీద పడుకున్నాను. అలిసి పోయిన శరీరం జోగుతూంది. నెమ్మదిగా మత్తు ఆవరిస్తూంది.

అలా ఎంత సేపు గడిచిందో తెలియదు-గబుక్కున మెలకువ వచ్చింది.

హాల్లో నవ్వులు ఆగిపోయాయి. మాటల జోరు కాస్త నెమ్మదిగా ఉంది. అయినా ఆ మాటల్లో ఏదో తీవ్రత, వాడి ఉన్నాయి.

“లేకపోతే, నమ్మించి మోసం చేస్తాడా? రెండేళ్ళు గ్రీన్ హౌస్‌లోనూ, పొలంలోనూ రాత్రనక, పగలనక కష్టపడి రిసెర్చి చేశాను గోధుమపై. ‘రస్ట్‌ఫ్రీ మ్యూటెంట్ వెరైటీ’ని కనుగొన్నాను. కానీ, దాన్ని కాస్త అటూ ఇటూ తారుమారు చేసి తానే పరిశోధించినట్టు పై అధికారులకు పేపర్సు పంపి, ప్రశంస తానే అందుకున్నాడు. తన పేరు మీదనే ఆ వెరైటీ రిలీజు చేసుకొన్నాడు మా మేజర్ అడ్వైజర్ ప్రొఫెసర్ రంగప్రసాద్.

“మధ్యలో నా శ్రమ, నా కృషి వమ్మయి పోయాయి! ఆ తరవాత ఎమ్. ఎస్. పూర్తి చేయా లనిపించలేదు.

“అప్పటికే మా మేజర్ అడ్వైజర్ కూతురు తారకు నే నంటే తగని మోజు. పడి చచ్చేది. మంచితనంగానే ఉండి పెళ్ళి చేసుకున్నాను. వచ్చేశాను. కానీ, నా కసి కసిగా మిగిలిపోయింది. ఐ వాంట్ టేక్ రివెంజ్ అగెన్స్ట్ దట్ రెచెడ్ పెర్సన్,


# S.S.M. ప్రోసెసింగ్ మిల్స్

స్థాపితం-1968

వీణా ఎంబ్రాయిడరీస్ గ్రూప్

కొమారపాళ్యం-638 183 (సేలం జిల్లా, తమిళనాడు)

వస్త్రముల ప్రోసెసింగ్ మిల్లులలో అగ్రగణ్యులైన ఎస్.ఎస్.ఎమ్. ప్రోసెసింగ్ మిల్స్‌వారు ఫిక్సెడ్ డిపాజిట్లు, ప్రత్యేక ఫిక్సెడ్ డిపాజిట్లు కోరుతున్నారు.

ఫిక్సెడ్ డిపాజిట్లకు సంవత్సరానికి

అధిక వడ్డీ

18%

వరకు

(ప్రతినెలా చెల్లించబడును)

ఇంకా ప్రత్యేక ఫిక్సెడ్ డిపాజిట్ల పథకం క్రింద కాలాంతమున చెల్లించబడు వడ్డీ వివరం :

| డిపాజిట్టు రూ॥లు | కాల పరిమితి సం॥లు | వడ్డీ రూ॥లు | అసలు వడ్డీ మొత్తము రూ॥లు | సంవత్సరానికి సామాన్య వడ్డీ శతం |
|---|---|---|---|---|
| 1000 | 3 | 600 | 1600 | 20% |
| 1000 | 4 | 840 | 1840 | 21% |
| 1000 | 5 | 1100 | 2100 | 22% |

అంగీకరింపబడు కనీసపు డిపాజిట్టు రూ. 1000/- లేక రూ. 1000/-ల ద్విగుణీకృత సంఖ్యలలో.

MAC/SSM/81/TEL

క్రూక్!" మాటలు ముద్దగా వెలువడుతున్నాయి రాథోడ్ గొంతులో.

తాగిన మత్తులో, మనసులో దాచిన నిజాన్ని నిర్భయంగా వెలి గక్కుతున్నాడు రాథోడ్.

డాక్టర్ శ్రీ వాత్సవ్ గొంతు చాలా గమ్మత్తుగా వినవస్తోంది. ఏదో పాసిఫై చేస్తున్నట్టుంది.

నా ఆలోచనలు ప్రొఫెసర్ రంగప్రసాద్ మీదికి మళ్ళాయి.

ప్రొఫెసర్ రంగప్రసాద్‌కు ఏదో అవార్డు వచ్చిందని విన్నాను కానీ, దాని వెనక ఇంత గ్రంథం ఉందని కానీ, ఒక వ్యక్తి ఆవేదన కక్ష రూపంలో మిగిలిపోయి ఉందనీ కానీ తెలియదు.

హాల్లో చీకటి పేరుకుంది నిశ్శబ్దం తాండవిస్తోంది. అంటే వాళ్ళు వాళ్ళ రూమ్స్‌కు రిటైర్ అయ్యారన్న మాట! ఒత్తిగిలి, కళ్ళకు చేయి అడ్డు పెట్టుకుని పడుకున్నాను.

ఏదో ఎగత ఆవరిస్తోంది.

కంటిమీది చేయి తొలగించినట్టయి కళ్ళు తెరిచి చూశాను.

తారను గుర్తించనట్టే తిన్నంతసేపూ నాటక మాడగలిగాను కానీ ... తార నన్ను

హర్షధ్వానాలు చేయడానికి సైతం చేతకాని మూగవారిని చేసి ఎవలను కూర్చో బెట్టేది మాత్రమే నిజమైన వాగ్ధాటి.
—ఒబ్బెర్

ఎప్పుడో గుర్తించిందన్న వాస్తవానికి చిహ్నంగా ఎదుట తార!

"ఎవరూ?" అన్నాను లేచి కూర్చోబోతూ.

నా భుజం అదిమిపట్టి నా మంచం అంచున కూర్చుంది.

తార ఒకప్పుడు ఇలా నా మంచం మీద కూర్చుంటే, ఎంతో సంతోషంగా ఉండేది! నిర్భయంగా కళ్ళలో కళ్ళు ఉంచి కబుర్లు చెప్పుకునే వాళ్ళం. ఒకరి కంటిపాపలో మరొకరి ప్రతిబింబాన్ని తిలకిస్తూ ఏవో సుందర లోకాల్లో తేలియాడే వాళ్ళం.

కానీ, ఈ నాటి పరిస్థితి వేరు. నా మనస్స్థితి వర్ణనాతీతం.

కానీ, తార కవేమీ పట్టినట్టు లేదు. గదినిండా పరుచుకున్న పువ్వుపూవులాటి వెన్నెల. నా కళ్ళలోకి మూగగా గుచ్చి చూస్తోంది తార.

"కులాసాగా ఉన్నావా, రేష్మా?" పలుకరించాను.

"ఛీ! న న్నా పేరుతో పిలువకు!" అంది.

ఆమె కళ్ళు జలజలా వర్షిస్తున్నాయి. ఎన్నో రోజుల ఎడబాటు అనంతరం ఆత్మీయులను చూస్తే, గుండె లోతుల నుండీ కదిలి వచ్చే ఉద్వేగానికి చిహ్నం కన్నీళ్ళు! అందుకే చూస్తూ ఊరుకున్నాను.

అయినా, ఏ క్షణంలో రాథోడ్ ఊడిపడి తాగుడు మైకంలో ఏదేదో ఊహించుకొని ఏమి రభస చేస్తాడో అని పీకుతూంది నా మనసు.

మెమ్మదిగా తప్పుకొని లేవబోయాను. నా రెండు భుజాలూ అదిమి పట్టి నా ఛాతీమీద తల వాల్చుకొని, "లేవకు, శేషూ! ఇంకా స్పేసట్లో తెల్లవారుతుంది ... బీటలు వారిన ఈ గుండెను నీ ఎదపై క్షణకాలమైనా సేదదీరనీ!" అంటూ పిచ్చిగా గొణుగుతూంది తార.

వివాహానికి పూర్వం తార నాతో చనువుగా తిరిగిన మాట వాస్తవమే! అట్లా అని, ఆ చనువు పురస్కరించుకొని, ఒక వివాహితురాలి కాపురంలో అనర్థాన్ని సృష్టించడానికి మాత్రం విముఖుణ్ణి.

"నీకేం మతికానీ పోలేదుకదా" అన్నాను, మందలించే ధోరణిలో.

"ఈ మతి ఏనాడో పోయింది కాబట్టే నిన్ను కాదని, ఇతడి అందానికి వెర్రిగా ఆకర్షితురాలినై ఈ పశువు పాలిట పడ్డాను! ఆతడి అందం దీపశిఖ లాంటిది!" ఆమె మాటల్లో నవ్వుని కసి.

నేను పిహెచ్. డి. చేయడంకోసం పూసా ఇన్స్‌టిట్యూట్, నయీ దిల్లీ వెళ్ళడానికి పూర్వమే నాతో చనువుగా తిరగడాన్ని ఏ కారణం లేకనే తగ్గించి వేసింది తార.

కొత్తగా మాస్టర్స్ డిగ్రీ కోర్సులో చేరడానికి వచ్చిన పంజాబీ యువకుడు రాథోడ్‌తో కూడా కనుపించేది. రాథోడ్ అప్పుడు పన్నగా, పొడవుగా, ఒత్తయిన తుమ్మెద రెక్కల్లాంటి సాఫ్ జుట్టుతో, ఆకర్షణీయంగా చిరునవ్వులు చిందిస్తూ తారను వడేవాడు.

నేను ఢిల్లీ వెళుతున్నట్టు తారతో చెప్పాలని వెళితే, ఇంట్లో ఉండి లేదనిపించింది తార. నా మన. క్షోభను నాలోనే అణుచుకొని వెళ్ళిపోయాను. అలాటి తార నోట ఈ రోజు గమ్మత్తయిన మాటలు వినవస్తున్నాయి.

"తారా! నిన్ను, నీ జీవితాన్ని, ఇంత సుఖమయంగా తీర్చిదిద్దిన మీ వారిని అభినందించకుండా ఉండలేక పోతున్నాను! నిజంగా అదృష్టవంతురాలివి!" అన్నాను, ఆమెనుండీ తప్పుకొనే ప్రయత్నం చేస్తూ.

"ఎండమావిలో నీ ఎంత ఉందో నా అదృష్టమూ అంతే!"

"తారా! ప్లీజ్! సరిగా కూర్చో! చేజేతులా అనర్థాన్ని ఎందుకు సృష్టించడం?" మనసులో భయాన్ని మాటల్లో వ్యక్తంచేశాను.

"ఆ భయం నీకు అక్కరలేదు, శేషూ! విస్కీ మత్తు వదలకముందే మీరు వచ్చారు. మరొక బాటిల్ పట్టించాడు. ఇక రేపు మధ్యాహ్నానికే మెలుకువ! అతడికి బుద్ధి ఉంటే చాలు—మరేమీ అక్కరలేదు. నీ భయ సంకోచాలు పక్కకు నెట్టు. ఈ కాస్త సమయాన్నీ అనవసరమైన సంకోచాలతో పాడుచేయకు. నన్ను కాస్త మాట్లాడనీ, శేషూ!

"ఇందాకా అన్నావే సుఖమయ జీవితమని! అదంతా భ్రమ! నా చుట్టూ ఉన్న ఆధునిక సౌకర్యాలు, ఈ వ్యవహారం అంతా బూటకం! అవ లేవీ నాకు ఏ మాత్రమైనా మనశ్శాంతినీ, సంతోషాన్నీ కలిగించ లేవు!

"నీ గుండె నిండా నిక్షిప్తమయిన ప్రేమ ఉంది, శేషూ! ఈ పరితప్త హృదయాన్నీ, శరీరాన్నీ నీ బాహుబంధంలో ఇమిడ్చి సేదదీర్చు!" అంటూ నన్ను అల్లుకుపోయింది తార.

తార తెలివితక్కువ తనానికి ఒక పక్క ఉక్రోషమూ, ఆమెను ఇంకా అంతరాంతరాల్లో ఎక్కడో ప్రేమిస్తున్నందుకు జాలీ!

"తారా. ఛీ! ఏమిటిది? మనం చిన్నపిల్లలంకాదు! కనీసం అవివాహితురాలివైనా కాదు నీవు! జీవిత యానంలో చెరోదారిని విసిరివేయబడ్డ మనం, ఆ నదీ ప్రవాహ వేగంలోనే, ఒడిదుడుకుల్లోనే, ఏటికి ఎదురీదయినా సరే దరి చేరుకోవాలి ... కానీ! అందులో వగుస్తూ కూర్చోవడంలో అర్థం లేదు. ఎక్కడి కక్కడ సంతృప్తి అలవరుచుకోవాలి! నేను మగవాణ్ణి! ఏమిచేసినా చెల్లుతుంది! ఏదైనా చేయగలను! ... తారా! చెప్పేది అర్థంచేసుకో! లే! ... తారా! ఊరడిల్లు!"

"ఊరడింపుతో ఈ గుండె చల్లారదు! నాకు కావలసింది ఒక చిన్న అనురాగ వీచిక! పెళ్ళయింది లగాయతూ నన్ను అటు పంపలేదు! వాళ్ళ నిటు రానీయలేదు! పైగా, ఇతరులుగానీ, నేనుకానీ వేలెత్తి చూపడానికి వీలులేకుండా మసలుకొంటాడు! తాగేసి ఒళ్ళు తెలియకుండా ప్రవర్తించడమే అత గాడికి తెలుసుకానీ, నాకూ ఒక మనసుందనీ, అను క్షణం అతడి ప్రేమ అనురాగాలకోసం తపిస్తుందనీ అతడికి తెలియదు! జీవిత పయనంలో అలిసి పోయాను, శేషూ!"

తార ధోరణి శ్రుతిమించుతూంది! తారను ఒక్క ఊపులో పక్కకు నెట్టి లేచి నించుని, ఐరన్ గ్రిల్ గుండా బయటికి సారించాను దృష్టి. వేగు చుక్క దేదీప్యమానంగా వెలుగుతూంది అంబరాన!

"నీ కన్నా ఆ బండరాయి నయం! కోరివచ్చినా ననా? నోరు విప్పి నా మనసు వెల్లడించానా నీతులు బోధించడం!" పిచ్చిపిచ్చిగా వాగుతూంది తార! అదొక ఉన్మాదస్థితిలో ఉన్న తారను అలా వదిలి వేయడంలోనే ఉంది క్షేమం!

"అరియో, నవ్‌రంగ్ భాయీ! ఉఠో! టైమ్! ఈజ్ ఆఫ్ ఫర్ అవర్ డిపార్చర్!" ఆ వేకువజామున శ్రీ వాత్సవ్ గొంతు కంచులా మోగుతూంది.

తార మౌనంగా పక్క గదిలోకి నిష్క్రమించింది.

తార స్థితికి, నన్ను ప్రేమిస్తున్నందుకు జాలి పడాలో, సంతోషపడాలో తెలియలేదు.

క్రితంరోజు దారిలో 'వండర్‌ఫుల్ కపుల్' అని శ్రీవాత్సవ్ అన్న మాటలే చెవిలో గింగురుమంటున్నాయి! అతడి మాట లెలా ఉన్నా, ఆ ఆధునిక కుటీరంలోని వ్యక్తులు దారి తప్పిన పాంథుల్లా ఉన్నా రనిపించింది. ★